# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 30-04-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ రాబోయే జనాభా లెక్కింపులో కుల గణనను చేర్చాలని రాజకీయ వ్యవహారాల క్యాబినెట్ కమిటీ నిర్ణయించింది.
- ❖ జాతీయ భద్రతా సలహా బోర్డును కేంద్ర ప్రభుత్వం పునర్ వ్యవస్థీకరించింది.
- ❖ వేవ్స్ సదస్సును ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రేపు ముంబైలో ప్రారంభించనున్నారు.
- ❖ పవిత్ర "చార్ ధామ్ యాత్ర" ఈరోజు ప్రారంభమయ్యింది.
- ❖ కోల్‌కతాలోని ఒక హోటల్‌లో నిన్న రాత్రి జరిగిన అగ్నిప్రమాదంలో 15 మంది మృతి చెందారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అధ్యక్షతన ఆర్థిక వ్యవహారాలు, భద్రతా వ్యవహారాలు, రాజకీయ వ్యవహారాల క్యాబినెట్ సమావేశాలు ఈరోజు న్యూఢిల్లీలో వరుసగా జరిగాయి. ఈ సమావేశాల్లో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఆ వివరాలను కేంద్ర సమాచార ప్రసార శాఖా మంత్రి అశ్విని వైష్ణవ్ పాత్రికేయులకు వెల్లడించారు. రాబోయే జనాభా లెక్కింపులో కుల గణనను చేర్చాలని రాజకీయ వ్యవహారాల క్యాబినెట్ కమిటీ నిర్ణయించిందన్నారు. దేశ సామాజిక నిర్మాణం రాజకీయాల వల్ల ప్రభావితమవకుండా సర్వేలకు బదులుగా కుల గణనను పారదర్శకంగా జనాభా గణనలో చేర్చాలని అశ్విని వైష్ణవ్ వైష్ణవ్ పేర్కొంటూ...

(వాయిస్ 32 సెకన్లు)

షిల్లాంగ్ నుండి సిల్చార్ వరకు 22 వేల 864 కోట్ల రూపాయల వ్యయంతో నూతన రహదారి నిర్మాణానికి ఆర్థిక వ్యవహారాల కాబినెట్ కమిటీ ఆమోదం తెలిపిందని మంత్రి తెలియజేశారు. ఈ ప్రాజెక్ట్ ఈశాన్య ప్రాంత అభివృద్ధికి కీలక పాత్ర పోషిస్తుందన్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో చక్కెర రైతులకు క్వింటాలుకు 355 రూపాయల

ధరను ఇచ్చేందుకు సైతం కేబినెట్ ఆమోదం తెలిపింది. ఈ నిర్ణయం 5 కోట్ల మంది చెరకు రైతులకు, అలాగే చక్కెర కర్మాగారాల్లో పని చేస్తున్న 5 లక్షల మంది కార్మికులకు ప్రయోజనం చేకూరుతుందని అశ్విని వైష్ణవ్ వివరిస్తూ...

(వాయిస్ 32 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

జాతీయ భద్రతా సలహా బోర్డును కేంద్ర ప్రభుత్వం పునర్ వ్యవస్థీకరించింది. 'రా' ఏజెన్సీ మాజీ చీఫ్ అలోక్ జోషి ఛైర్మన్ గా ఉన్న ఈ బోర్డులో భారత సైన్యంలో పని చేసిన మాజీ అధికారులు ఎయిర్ మార్షల్ పీఎం సిన్హా, లెఫ్టినెంట్ జనరల్ ఏకే సింగ్, అడ్మిరల్ మోంటీ ఖన్నా, మాజీ ఐపీఎస్‌లు రాజీవ్ రంజన్ వర్మ, మన్మోహన్ సింగ్, మాజీ ఐఎఫ్ఎస్ బి.వెంకటేశ్ వర్మ సభ్యులుగా ఉన్నారు. ఈరోజు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన భద్రతా వ్యవహారాలపై క్యాబినెట్ కమిటీ సమావేశంలో ఈ మేరకు  నిర్ణయం తీసుకున్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారతదేశంలో మొట్ట మొదటిసారిగా జరుగుతున్న వరల్డ్ ఆడియో విజువల్ ఎంటర్‌టైన్‌మెంట్ సమ్మిట్ (వేవ్స్ సదస్సు)ను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రేపు ముంబైలోని జియో వరల్డ్ కన్వెన్షన్ సెంటర్‌లో ప్రారంభించనున్నారు. "కనెక్టింగ్ క్రియేటర్స్, కనెక్టింగ్ కంట్రీస్" అనే ఇతివృత్తంతో నాలుగు రోజుల పాటు జరిగే ఈ సదస్సు మీడియా, వినోదం, డిజిటల్ ఆవిష్కరణలకు ప్రపంచ కేంద్రంగా భారతదేశాన్ని నిలపాలని రూపొందించారు. సినిమాలు, OTT, గేమింగ్, కామిక్స్, డిజిటల్ మీడియా, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ లాంటి అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలను ఈ సదస్సు ఏకీకృతం చేయనుంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఉత్తరాఖండ్‌లో పవిత్ర చార్ ధామ్ యాత్ర ఈరోజు ప్రారంభమయ్యింది. అక్షయ తృతీయ సందర్భంగా ఉత్తరకాశి జిల్లాలోని గంగోత్రి, యమునోత్రి పుణ్యక్షేత్రాల ద్వారాలను భక్తుల కోసం తెరిచి 6 నెలల హిమాలయ పుణ్యక్షేత్రాల ఆధ్యాత్మిక ప్రయాణానికి నాంది పలికారు. ఈ సందర్భంగా దేశంలోని వివిధ ప్రాంతాల నుండి పెద్ద సంఖ్యలో భక్తులు రెండు పుణ్యక్షేత్రాలలో ప్రార్థనలు చేశారు. ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి గంగోత్రి ధామ్‌ను సందర్శించి పూజలు చేశారు. యాత్రికుల సౌలభ్యం కోసం రాష్ట్ర ప్రభుత్వం త్వరితగతిన ఏర్పాట్లు చేసిందని తెలియజేశారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

పశ్చిమ బెంగాల్ సెంట్రల్ కోల్‌కతాలోని ఒక హోటల్‌లో నిన్న రాత్రి జరిగిన అగ్నిప్రమాదంలో 15 మంది మృతి చెందారు. అగ్ని ప్రమాదానికి గల కారణం ఇంకా తెలియాల్సి ఉంది. ఈ సంఘటనపై దర్యాప్తు చేయడానికి ఒక ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసినట్లు కోల్‌కతా పోలీస్ కమిషనర్ మనోజ్ కుమార్ వర్మ తెలిపారు. ఈ ప్రమాద ఘటనపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

కన్నడ కవి, సామాజిక సంస్కర్త జగద్గురు బసవేశ్వర జయంతి ఈరోజు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సామాజిక మాధ్యమంలో జగద్గురు బసవేశ్వరుని గురించి ఒక వీడియో విడుదల చేశారు. అణగారిన వర్గాల అభ్యున్నతికి ఆయన చేసిన అవిశ్రాంత ప్రయత్నాలు ప్రజలకు మార్గనిర్దేశం చేస్తూనే ఉన్నాయని ఆ సందేశంలో పేర్కొన్నారు. కేంద్ర మంత్రులు అశ్విని వైష్ణవ్, కిరణ్ రిజిజు, ప్రహ్లాద్ జోషి, శోభా కరంద్లాజే తదితరులు పార్లమెంటు భవన సముదాయంలో గురు బసవేశ్వరునికి పుష్పాంజలి ఘటించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ ఈరోజు న్యూఢిల్లీలో ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్లు (ERO)లు, బూత్ లెవల్ ఆఫీసర్లు (BLO)ల కోసం రెండు రోజుల శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించారు. బీహార్, హర్యానా, ఢిల్లీ, ఉత్తరప్రదేశ్ నుండి EROలు, BLOలు ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నారు. ఎన్నికల సంఘం శాసనసభలకు చేస్తున్న ఎన్నికల సన్నాహాలలో ఈ శిక్షణా కార్యక్రమం ఒక భాగం. మొత్తం 369 మంది క్షేత్ర స్థాయి ఎన్నికల అధికారులు ఈ శిక్షణా కార్యక్రమంలో పాల్గొంటున్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)లో భాగంగా ఈరోజు చెన్నై వేదికగా పంజాబ్ కింగ్స్, చెన్నై సూపర్ కింగ్స్ జట్ల మధ్య క్రికెట్ మ్యాచ్ జరుగుతోంది. తొలుత బ్యాటింగ్ చేస్తున్న చెన్నై సూపర్ కింగ్స్ జట్టు 9 ఓవర్లు పూర్తయ్యే సరికి 3 వికెట్ల నష్టానికి 80 పరుగులు చేసింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

జమ్మూ కాశ్మీర్‌లోని నియంత్రణ రేఖ వెంబడి నిన్న రాత్రి పాకిస్తాన్ సైన్యం జరిపిన కాల్పులకు భారత సైన్యం సమర్ధవంతంగా ప్రతిఘటించింది. నౌషేరా, సుందర్‌బానీ, అఖ్నూర్ సెక్టార్‌కు ఎదురుగా ఉన్న ప్రాంతాలలో నియంత్రణ రేఖ వెంబడి పాకిస్తాన్ ఆర్మీ పోస్టులు ఎటువంటి కవ్వింపు చర్యలు లేకుండా కాల్పులు జరిపాయని రక్షణ వర్గాలు తెలిపాయి. బారాముల్లా, కుప్వారా జిల్లాలతో పాటు పర్గ్వాల్ సెక్టార్‌లోని అంతర్జాతీయ సరిహద్దు వెంబడి కూడా పాకిస్తాన్ సైన్యం కాల్పులు జరిపింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నంజిల్లాలో సింహాచలం ఆలయంలో క్యూ లైన్‌లో వేచి ఉన్న ఏడుగురు భక్తులు ఈరోజు తెల్లవారుజామున అర్ధరాత్రి కురిసిన భారీ వర్షానికి క్యూ లైన్ గోడ కూలిపోవడంతో ప్రాణాలు కోల్పోగా నలుగురు గాయపడ్డారు. చందనోత్సవం సందర్భంగా ఈరోజు భక్తులు అధిక సంఖ్యలో వరాహ నరసింహ స్వామి వారి నిజరూపాన్ని దర్శించుకుండేందుకు కొండపైకి చేరుకున్నారు. ఈ ప్రమాదంపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ఎన్. చంద్రబాబు నాయుడు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. గాయపడిన వారికి అత్యవసర వైద్య చికిత్స అందించాలని అధికారులను ఆదేశించారు. మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి 25 లక్షల రూపాయల ఎక్స్‌గ్రేషియా, గాయపడిన ప్రతి ఒక్కరికి 3 లక్షల రూపాయల ఆర్థిక సహాయం ప్రకటించారు. ఈ ప్రమాద ఘటనలో భక్తులు ప్రాణాలు కోల్పోవడం పట్ల రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ విచారం వ్యక్తం చేశారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని రాష్ట్రపతి ఆకాంక్షించారు. మృతుల కుటుంబ సభ్యులకు ప్రధానమంత్రి జాతీయ సహాయ నిధి నుండి 2 లక్షల రూపాయలు, గాయపడిన వారికి 50 వేల రూపాయలు చొప్పున పరిహారం అందిస్తున్నట్లు ప్రధానమంత్రి కార్యాలయం ప్రకటించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశీయ స్టాక్ మార్కెట్ ఈరోజు స్వల్ప నష్టాల్లో ముగిసాయి. సెన్సెక్స్ ఉదయం 80 వేల 370 పాయింట్ల వద్ద ప్రారంభమై.. చివరకు స్వల్ప నష్టంతో 80 వేల 242 పాయింట్ల వద్ద ముగిసింది. అటు నిఫ్టీ 1.75 పాయింట్లు తగ్గి 24 వేల 334 వద్ద స్థిరపడింది. డాలర్‌తో రూపాయి మారకం విలువ 47 పైసలు పెరిగి 84.49గా కొనసాగుతోంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =